# డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు?

- నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్టు ఫిర్యాదులు
- మరోసారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించాలని నిర్ణయం
- ఇప్పటికే రెండుసార్లు పూర్తి.. మరో దఫాకు పిలుపు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ- 2024 స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీలో అక్రమాలు జరిగినట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్టుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో అధికార యంత్రాంగం సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను మొదలుపెట్టింది. ఇప్పటికే రెండుసార్లు వెరిఫికేషన్ చేయగా మరోసారి కూడా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్ర, శనివారాల్లో సర్టిఫికేషన్ వెరిఫికేషన్ చేయనున్నట్టు అభ్యర్థులకు సమాచారం అందించారు.

**తొలిసారిగా స్పోర్ట్స్ కోటా..**

టీచర్ పోస్టుల భర్తీలో తొలిసారిగా స్పోర్ట్స్ కోటాను అమలుచేశారు. ఈ కోటాలో 95 పోస్టులుండగా, దాదాపు 8వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఫలితాలు ప్రకటించిన తర్వాత. స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్ వెరిఫికేషన్ బాధ్యతను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు(శాట్స్) అప్పగించారు. 393 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. సవ్యంగా తేలిన 33 మందికి ఉద్యోగాలిచ్చారు. మిగిలిన అరవైకి పైగా పోస్టులను స్పోర్ట్స్ కోటాయేతర అభ్యర్థులతో ఓపెన్ కోటాకు మళ్లించి భర్తీచేశారు. అయితే స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియపై పలువురు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో తొలుత అక్టోబర్ మొదటి వారంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టగా, నవంబర్ 20, 21, 22 తేదీల్లో మరోసారి నిర్వహించారు. నవంబర్‌లో కింది స్థాయి అధికారులు (లో లెవల్ కమిటీ ) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారని, మరోసారి జనవరి 3, 4 తేదీల్లో హై లెవల్ కమిటీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తుందని తాజాగా 393 మంది అభ్యర్థులకు సమాచారమిచ్చారు. దీంతో స్పోర్ట్స్ కోటా టీచర్ పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగాయన్న అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి.



ఢిల్లీలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ

# సీబీసీతో 'గీతం కేస్ పీపీ' అవగాహన

## 2.5 కోట్ల మంది పౌరసేవల సామర్థ్యం బలోపేతం

పటాన్‌చెరు, జనవరి 2: కేంద్ర ప్రభుత్వంలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ)తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ గురువారం న్యూఢిల్లీలోని సీబీసీ కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వంలోని మానవ వనరుల నిర్వహణను మెరుగుపర్చడం, దేశంలోని 2.5 కోట్ల పౌరసేవల సామర్థ్యం బలోపేతం చేసే లక్ష్యంతో ఈ నాలెడ్జ్ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఈ ఒప్పందంపై కేఎస్‌పీపీ తరపున డీన్, పూర్వ రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్, డాక్టర్ షరీక్ హసన్ మన్‌జీర్, సీబీసీ ప్రతినిధి బృందంలో మానవ వనరుల విభాగం సభ్యుడు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి ఎస్‌పీ రాయ్, అధికారులు రాహుల్ పోర్వాల్, నిఖితాసురానా పాల్గొన్నారు. మానవ వనరుల అభ్యాసా లు, సామర్థ్యం పెంపొందించడంలో సీబీ సీ ముందంజలో ఉండి, వివిధ మంత్రిత్వ శాఖల పరిధిలోని విభాగాలకోసం ప్రణాళికలను రూపొందించి, అమలు చేయడానికి కృషి చేస్తున్నది. ప్రముఖ సంస్థలతో వ్యూహాత్మక జ్ఞాన భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకుంటున్నది. కేఎస్‌పీపీ, సీబీసీల మధ్య ఈ భాగస్వామ్యం కేంద్ర ప్రభుత్వపాలనలో విప్లవాత్మక మార్పులకు, పౌర సేవల సామర్థ్యాన్ని పెంపొందించి, ప్రభావవంతమైన ఫలితాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది.

# సింగరేణిలో సభ్యత్వ 'వసూళ్లు'!

- కార్మికుల కష్టార్జితంపై సర్కార్ కన్ను
- ఒక్కో కార్మికుడి నుంచి నెలకు 50 చొప్పున వసూలుకు సన్నాహాలు
- నెలకు రూ.20 లక్షల వసూలుకు స్కెచ్
- గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ఖాతాల్లో జమ చేసేందుకు ప్లాన్
- ఆమోదముద్ర వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సంతకాలు లేకుండానే వసూలు చేయడంపై కార్మికవర్గం మండిపాటు
- 2017లోనే వసూలును నిలిపివేసిన కేసీఆర్ సర్కార్



గోదావరిఖని, జనవరి 2: సింగరేణి కార్మికుల కష్టార్జితాన్ని దోపిడీ చేసేందుకు రంగం సిద్ధమైంది. సభ్యత్వ రుసుం పేరిట ప్రతి నెలా రూ.20 లక్షలకు పైగా వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. మొదట్లో సభ్యత్వ రుసుం కింద ఒక్కో కార్మికుడి నుంచి నెలకు రూ.10 చొప్పున వసూలు చేసేవారు. ఆ తర్వాత 2017 వరకు నెలకు రూ.20 చొప్పున వసూలు చేశారు. అయితే, ఈ వసూలును 2017లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అవసరమైతే కార్మికుల ఖాతా నుంచి నెలకు ఒక్క రూపాయి మాత్రమే తీసుకోవచ్చని ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత ఈ వసూలు పూర్తిగా నిలిచిపోయింది.

**కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో...**

సభ్యత్వ రుసుం పేరిట సింగరేణి కార్మికుల కష్టార్జితాన్ని కొల్లగొట్టడాన్ని బీఆర్‌ఎస్ సర్కార్ నిలిపివేయగా.. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ వసూళ్లకు అనుమతులు ఇచ్చింది. హస్తం పార్టీ అధికారంలోకి రావడం, ఆ పార్టీకి అనుకూలంగా ఉండే సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా ఎన్నికల్లో గెలుపొందడం, ప్రాతినిధ్య సంఘంగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ ఉండటంతో మళ్లీ సభ్యత్వ అంశం తెరపైకి వచ్చింది.

**రెండు సంఘాల మధ్య ఒప్పందం**

సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ రామగుండం-1, 2, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లిలో గెలుపొందింది. రామగుండం-3, భూపాలపల్లి, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాల్లో ప్రాతినిధ్య కార్మిక సంఘంగా గుర్తింపు పొందింది. సింగరేణిలో ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితులు ఉండటంతో మళ్లీ సభ్యత్వ రుసుం అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది కార్మికులపై దీని ప్రభావం పడుతుంది. ఒక్కొక్కరి నుంచి రూ.50 చొప్పున నెలకు రూ.20 లక్షలు కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారు. సింగరేణి వ్యాప్తంగా సభ్యత్వం నమోదు చేసుకునే అవకాశం గుర్తింపు కార్మిక సంఘానికి ఉంటుంది. ప్రాతినిధ్య కార్మిక సంఘానికి గెలుపొందిన ఆరు ఏరియాల్లో మాత్రమే సభ్యత్వం నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో గుర్తింపు కార్మిక సంఘం 70 శాతం, ప్రాతినిధ్య కార్మిక సంఘం 30 శాతం సభ్యత్వ రుసుం వసూలు చేసుకునే విధంగా రెండు సంఘాల మధ్య ఒప్పందం కుదిరినట్టు తెలుస్తున్నది. అంటే ప్రతి నెల వసూలయ్యే రూ.20 లక్షల్లో గుర్తింపు సంఘానికి రూ.14 లక్షలు, ప్రాతినిధ్య సంఘానికి రూ.6 లక్షలు దక్కే అవకాశం ఉంది.

**సెప్టెంబర్ నుంచి వసూలుకు నిర్ణయం!**

సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా గెలుపొందిన సంఘాలకు గుర్తింపుపత్రం ఇచ్చిన సెప్టెంబర్ నెల నుంచి కార్మికుల సభ్యత్వ రుసుం వసూలు చేసేందుకు నిర్ణయించినట్టుగా తెలుస్తున్నది. అంటే ఒక్కో కార్మికుడి ఖాతా నుంచి ఐదు నెలల సభ్యత్వ రుసుం పేరిట రూ.250 ఒకేసారి వసూలు చేయనున్నారు. ఈ ఐదు నెలలకు కలిపి మొత్తం రూ.కోటి వరకు వసూలయ్యే అవకాశం ఉంది. ఈ ప్రకారం గుర్తింపు కాలపరిమితి ముగిసే వరకు ప్రతినెలా కార్మికుడి ఖాతా నుంచి సంబంధిత రుసుం కట్ చేసి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ఖాతాల్లో యాజమాన్యం జమ చేస్తుంది.

**సంతకాలు లేకుండానే వసూలు?**

సింగరేణి కార్మికుల నుంచి సభ్యత్వ రుసుం వసూలు చేయడానికి కార్మికుల అనుమతి, సంతకం తప్పనిసరి. అయితే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మాత్రం చాలామంది కార్మికుల సంతకాలను ఫోర్జరీ చేసి యాజమాన్యానికి సమర్పించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. సభ్యత్వ రుసుం విషయంలో ఫిర్యాదు చేస్తే గెలిచిన సంఘాలు తమను ఇబ్బంది పెడతాయని భయపడి కార్మికులు మిన్నకుండిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీన్ని కార్మిక సంఘాలు తమకు అనుకూలంగా మలుచుకొని కాసులు దండుకునేందుకు పన్నాగాలు చేస్తున్నాయి.

## సంతకాలు లేకుండా వసూలు చేస్తే సహించం



గతంలో సింగరేణి కార్మికుల సభ్యత్వ రుసుం రూ.10, రూ.20 మాత్రమే వసూలు చేసేవారు. 2017లో అప్పటి సీఎం కేసీఆర్ ఈ వసూలును నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ భారీ మొత్తంలో వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వడం సరికాదు. నెలకు రూ.50 చొప్పున వసూలు చేయడం అనైతికం. కార్మికుల సంతకాలు లేకుండా వసూలు చేస్తే సహించేది లేదు. కార్మికుల నుంచి చందాల రూపంలో రూ.200 చొప్పున వసూలు చేసిన డబ్బులను సింగరేణి యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఖాతాలో వేయడానికి ముందుకురావడం సబబు కాదు. ముందుగా టెంపుల్ కమిటీ పేరుతో వసూలు చేసిన డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమచేయాలి. అనంతరం కార్మికుల అనుమతి తీసుకొని గుర్తింపు కార్మిక సంఘం తీసుకుంటే బాగుంటుంది. ఇందుకు భిన్నంగా సింగరేణి యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నామని పేర్కొంటూ సొమ్ము తీసుకోవడం భావ్యం కాదు. ఇప్పటికైనా ఈ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి.

-మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

# ఎలక్ట్రిక్ బస్సుల పేరిట ఆర్టీసీ నిర్వీర్యానికి కుట్ర

## నిర్వహణ నుంచి తప్పించుకునేందుకు సర్కారు యత్నం

ప్రభుత్వ చర్యలపై ఆర్టీసీ కార్మికుల్లో ఆందోళన ● 6న కార్మిక సంఘాల రాష్ట్రస్థాయి సదస్సు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రిక్ బస్సుల పేరిట ఆర్టీసీ నిర్వీర్యానికి కుట్ర జరుగుతున్నదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహాలు పొందడానికి, ఆర్టీసీ బస్సులకు పెట్టుబడి పెట్టే బాధ్యత నుంచి తప్పుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు బస్సులను తీసుకొస్తున్నదని విమర్శిస్తున్నారు. 2030 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీంతో గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్ల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా టీజీఎస్‌ఆర్టీసీ కాస్తా ప్రైవేట్ విద్యుత్తు బస్సుల సంస్థగా మారిపోతుందని పేర్కొంటున్నారు. ఆర్టీసీ యాజమాన్యం చర్యలను అడ్డుకునేందుకు ఈ నెల 6న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'విద్యుత్తు బస్సులు- ప్రజలు, ఆర్టీసీపై ప్రభావం' అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్‌రావు తెలిపారు. సదస్సుకు ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాల నాయకులకు ఆహ్వానించారు. రెండు బడా కంపెనీలకు ఈవీ బస్సులను కట్టబెట్టి ఆర్టీసీని ఆగం జేసేందుకు ప్రయత్నిస్తున్నారని టీఎంయూ ప్రధాన కార్యదర్శి ఎం థామస్‌రెడ్డి ఆరోపించారు. మహిళా సంఘాల పేరిట తమ బినామీలకు ఈవీ బస్సులు కట్టబెట్టే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు.

## నీట్-యూజీపై సిఫారసులు అమలుజేస్తాం

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 2: 'నీట్-యూజీ' పరీక్ష నిర్వహణలో చేపట్టాల్సిన సంస్కరణలపై ఏర్పాటుచేసిన ఏడుగురు సభ్యుల నిపుణుల కమిటీ సిఫారసులను అమలు జేయబోతున్నట్టు కేంద్రం తాజాగా సుప్రీంకోర్టుకు తెలిపింది. గత ఏడాది 'నీట్-యూజీ' పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏ పనితీరును సమీక్షించిన నిపుణుల కమిటీ తన నివేదికను సమర్పించిందని, పలు దిద్దుబాటు చర్యల్ని సూచించినట్టు కేంద్రం గురువారం పేర్కొన్నది. కమిటీ సిఫారసులన్నీ అమలుజేస్తున్నట్టు కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలిపారు. నీట్-యూజీ-2024 పరీక్షపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చెలరేగిన సంగతి తెలిసిందే. వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన పరీక్షలో ఓ ప్లాన్ ప్రకారం మాల్‌ప్రాక్టీస్, పేపర్ లీకేజ్ జరిగిందన్న ఆరోపణలు వెలువడ్డాయి. అయితే ఆరోపణలపై సరైన ఆధారాలు లేవని పరీక్షను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు సంబంధించి నిపుణుల కమిటీ ఏర్పాటుచేసింది.

## మరణశిక్ష పడ్డ కేరళ నర్సుకు సాయపడతాం

- హామీ ఇచ్చిన ఇరాన్

న్యూఢిల్లీ, జనవరి 2: హత్య ఆరోపణలతో యెమెన్ దేశంలో మరణ శిక్ష పడ్డ కేరళ నర్సు నిమిష ప్రియకు తాము సహాయం చేస్తామని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఆమెకు శిక్ష పడ్డ ప్రాంతం హౌతీల ఆవల పరిధిలో ఉందని, అయినప్పటికీ ఆమె విడుదలకు తాము చేయగలిగినంత సహాయం చేస్తామని. కఠిన చర్యలకు వెనుకాడమని ఇరాన్ హామీ ఇచ్చింది. కాగా, ఇప్పటికే ఆమెను విడిపించడానికి భారత విదేశాంగ శాఖ ప్రయత్నాలు చేస్తున్నది. బాధిత కుటుంబానికి బ్లడ్ మనీ అందజేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. 37 ఏండ్ల నిమిష ప్రియ యెమెన్ వాసి తలాల్ అబ్దో మహదీని హత్య చేసిన ఆరోపణలపై 2017 నుంచి శిక్ష అనుభవిస్తున్నది. 2018లో ఆమెకు మరణశిక్ష విధించగా, తాజాగా యెమెన్ అధ్యక్షుడు దానిని ఆమోదించారు. ఆమెకు బాధిత కుటుంబం నుంచి క్షమాపణ కనుక లభించకపోతే నెల రోజుల్లో మరణ శిక్ష అమలవుతుంది.

## సెల్‌ఫోన్ విషయంలో విద్యార్థుల ఘర్షణ

- గురుకులంలో ఐదుగురిని సస్పెండ్ చేసిన ప్రిన్సిపాల్

మహబూబాబాద్ రూరల్, జనవరి 2: మహబూబాబాద్ మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల విద్యార్థులు సెల్‌ఫోన్ విషయంలో ఘర్షణపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గురుకులంలో వాటర్ పోయడానికి బుధవారం మధ్యాహ్నం ఆటోలో వాటర్‌మాన్ రాగా, క్యాన్లను కౌంట్ చేసేందుకు 9వ తరగతి విద్యార్థి రాజేందర్‌ను టీచర్లు అక్కడ ఉంచారు. వాటర్‌మాన్ తన సెల్‌ఫోన్‌ను రాజేందర్‌కు ఇవ్వగా, 10వ తరగతి విద్యార్థి రేవంత్ వచ్చి ఫోన్ చేసుకుంటానని అడగగా ఇవ్వలేదు. దీంతో రేవంత్ అర్ధరాత్రి స్నేహితులతో కలిసి రాజేందర్‌ను కొట్టడంతో అతడు వ్యాయామ ఉపాధ్యాయుడికి ఫిర్యాదుచేశాడు. గురువారం ఆ ఉపాధ్యాయుడు రేవంత్‌ను కర్రతో కొట్టడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి వ్యాయామ ఉపాధ్యాయుడితో ఘర్షణ పడగా విద్యార్థులను పిలిపించి ఘటనను వివరించడంతో పేరెంట్స్ వెళ్లిపోయారు. ప్రిన్సిపాల్ రాజేశ్‌ను వివరణ కోరగా రాజేందర్‌ను రేవంత్, అతడి స్నేహితులు కొట్టారని, ఈ విషయంపై టీచర్లతో విచారించి ఐదుగురు విద్యార్థులను పాఠశాల నుంచి సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు.

# ఆ 52 ఎకరాలూ ప్రభుత్వానివే!

కొత్వాల్‌గూడ భూములపై రంగారెడ్డి జిల్లా కోర్టు కీలక తీర్పు ● తాసీల్దార్‌కు సమాచారం అందించిన ప్రభుత్వ న్యాయవాది

- విలువైన భూముల్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సూచన
- 270 ఎకరాల్లో 218 ఎకరాలు వివిధ అవసరాలకు వినియోగం
- ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న మిగిలిన 52 ఎకరాల భూములు
- రూ.250 కోట్లకు పైగా విలువైన భూముల రక్షణకు చర్యలు మొదలు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 2 (నమస్తే తెలంగాణ)/మణికొండ: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని కొత్వాల్‌గూడ గ్రామంలో 52 ఎకరాల భూమిపై నెలకొన్న వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. దాదాపు రూ.250 కోట్లకు పైగా విలువ చేసే ఈ భూములు ప్రభుత్వానికి చెందినవేనంటూ రంగారెడ్డి రెండో అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా సమాచారం అందించారు. విలువైన భూములు కావడంతో తీర్పు ప్రతి అందేలోపు భూముల్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ముందుగానే అప్రమత్తం చేశారు. దీంతో శంషాబాద్ తాసిల్దార్ ఆధ్వర్యంలో అధికారులు ఆ భూముల రక్షణకు చర్యలు మొదలుపెట్టారు.

**ఇదీ వివాదం**

కొత్వాల్‌గూడ గ్రామంలోని సర్వేనంబర్ 54లో 270.17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలోని అత్యధిక విస్తీర్ణాన్ని పలు ప్రజా ప్రయోజనకర అవసరాలకు వినియోగించారు. ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ రిసెర్చి ల్యాబరేటరీ (ఏపీఈఆర్‌ఎల్) కూడా ఇందులోని 30 ఎకరాల విస్తీర్ణంలోనే ఏర్పాటైంది. కొన్ని దశాబ్దాల కిందట హుడాకు 75 ఎకరాలు కేటాయించారు. పర్యాటక శాఖకు 50 ఎకరాలు ఇచ్చారు. రైల్వే వర్క్‌షాప్ ఏర్పాటుకు 12 ఎకరాలు కేటాయించారు. హెచ్‌ఎండీఏకు 45 ఎకరాలు ఇవ్వగా... గతంలోని 75 ఎకరాలతో కలుపుకొని కొత్వాల్‌గూడ ఎకో టూరిజం పార్క్‌ను అభివృద్ధి చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏకంగా రూ.180 కోట్లతో ఈ పార్క్ అభివృద్ధిని చేపట్టారు. మరో ఐదెకరాల్లో చౌడమ్మ దేవాలయం, ఎకరంలో హనుమాన్ దేవాలయం ఉండగా... 15 గుంటలను శ్మశాన వాటికకు కేటాయించారు. ఇవన్నీపోను 52 ఎకరాల భూమి ఉంది. దీనిపైనే ఉమ్మడి రాష్ట్రం నుంచి వివాదం కొనసాగుతున్నది.

**26 మందికి భూ విక్రయాలు...**

ఈ 52 ఎకరాల భూమి ప్రస్తుతం 26 మంది ప్రైవేటు వ్యక్తుల పేరిట ఉంది. నిజాం దగ్గర పనిచేసినందుకుగాను గాలయ్య అనే వ్యక్తికి నవాబు ఈ 52 ఎకరాలను ఇచ్చారని, తద్వారా వారి వారసుల నుంచి తాము భూములను కొనుగోలు చేశామని సదరు ప్రైవేటు వ్యక్తులు పేర్కొంటున్నారు. మరో రకమైన వాదన కూడా ప్రచారంలో ఉంది. గాలయ్య అనే వ్యక్తికి ఉన్న 52 ఎకరాల భూమి హిమాయత్‌సాగర్ రిజర్వాయర్‌లో పోయినందున... అందుకు ప్రతిగా ఈ భూమి కేటాయించారని చెప్పుకుంటున్నారు. ఈ వాదనను రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. గాలయ్యకు నష్టపరిహారం చెల్లించారు తప్ప భూమికి బదులుగా భూమి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమకు పట్టాపాసు పుస్తకాలు జారీ చేయాలంటూ 2006లో ప్రైవేటు వ్యక్తులు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోగా వారు తిరస్కరించారు. దీంతో అప్పట్లో రెండో అదనపు జూనియర్ సివిల్ కోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చినట్టు తెలిసింది. దీంతో సదరు వ్యక్తులు 52 ఎకరాల భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

## రెవెన్యూశాఖ అప్పీలు

*కోర్టు తీర్పుపై రెవెన్యూ శాఖ అప్పీలుకు వెళ్లింది. ఈ మేరకు 2018లో రంగారెడ్డి రెండో అదనపు జిల్లా న్యాయస్థానంలో దాదాపు 20 వరకు దావాలు వేశారు. గత ఆరేండ్లుగా వీటిపై వాదనలు కొనసాగాయి. ఎట్టకేలకు ఇటీవల న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చింది. కొత్వాల్‌గూడ సర్వేనంబరు 54లోని 270.17 ఎకరాలు పూర్తిగా ప్రభుత్వ భూమి అని న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే అధికారికంగా తీర్పు ప్రతి ఇంకా వెలువడలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో రెవిన్యూ శాఖను అప్రమత్తం చేసి భూములను రక్షించేందుకుగాను ప్రభుత్వ న్యాయవాది (జీపీ) రాజ్‌కుమార్ శంషాబాద్ తాసీల్దార్ రవీంద్రదత్తకు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు. ప్రభుత్వ భూమి అని తీర్పు రావడం సంతోషకరమని, ఈ క్రమంలో జీపీ ముందుగానే అప్రమత్తం చేసిన దరిమిలా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న 52 ఎకరాల స్వాధీనానికి చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ రవీంద్ర దత్త 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.*

## ముజిబుర్ ఇక బంగ్లా జాతిపిత కాదు!


- పాఠ్య పుస్తకాల్లో బంగ్లా చరిత్ర మార్పు



ఢాకా, జనవరి 2: బంగ బంధుగా పేరొందిన మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహ్మాన్ ఆనవాళ్లను ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం ఒక్కొక్కటిగా చెరిపేస్తున్నది. ఇటీవల కరెన్సీ నోట్లపై ఆయన చిత్రాన్ని తొలగించిన సర్కారు.. తాజాగా చరిత్ర పాఠ్య పుస్తకాల్లో ఆయన దేశ స్వాతంత్ర్య ప్రకటన చేయలేదని పేర్కొంది. ఆయనకు ఉన్న జాతిపిత గౌరవ బిరుదును తొలగించింది. ది డైలీ స్టార్ కథనం ప్రకారం.. 2025 విద్యా సంవత్సరానికి గాను ప్రాథమిక, సెకండరీ విద్యార్థుల పాఠ్య పుస్తకాల్లో పలు మార్పులు చేశారు. వాటిలో పేర్కొన్న ప్రకారం... మార్చి 26, 1971న ఆర్మీ మేజర్ జియా ఉర్ రెహ్మాన్ బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ప్రకటన చేశారు. ఆ మరుసటి రోజు బంగబంధు తరపున ఆయన మరోసారి స్వాతంత్ర్య ప్రకటన చేశారు. గత ప్రభుత్వాలు అతిశయోక్తితో కూడిన చరిత్రను విద్యార్థులపై రుద్దాయని కొత్త పాఠ్య పుస్తకాల రచయిత, పరిశోధకుడు రఖాల్ రహా విమర్శించారు. ముజిబుర్ రెహ్మాన్ హత్యకు గురైన ఆగస్టు 15న ఉన్న జాతీయ సెలవును తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసింది.

## భార్య వేధింపులతో కుంగిపోయాను

- చివరి వీడియోలో ఢిల్లీ కేఫ్ యజమాని పునీత్ ఆవేదన



న్యూఢిల్లీ: భార్య వేధింపులను తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్న కేఫ్ యజమాని పునీత్ ఖురానా (40) రికార్డు చేసిన చిట్టచివరి వీడియో సంచలనంగా మారింది. ఆయన తన ఇంట్లో ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఈ వీడియోను తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసినట్లు తెలుస్తున్నది. ఈ వీడియో నిడివి 54 నిమిషాలు ఉన్నట్లు పోలీసు వర్గాలు చెప్పాయి. దీనిలో రెండున్నర నిమిషాల క్లిప్ గురువారం బయటకు వచ్చింది. దీనిలో పునీత్ మాట్లాడుతూ, తన భార్య, మామయ్య, ఆమె తరపు బంధువులు తనను తీవ్రంగా హింసించి, వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోకుండా, అదనంగా రూ.10 లక్షలు చెల్లించాలని తనను వేధించారని తెలిపారు. తాను మానసికంగా కుంగిపోయానని, ఇదే తన చివరి స్టేట్‌మెంట్ అని తెలిపారు. ఆయన మంగళవారం తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. పునీత్ భార్యను, ఆమె తండ్రిని ప్రశ్నించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. పునీత్ మొబైల్ ఫోన్‌ను ఆయన మామయ్య త్రిలోక్‌నాథ్ తమకు అప్పగించారని పోలీసులు చెప్పారు.

# అంచనాకు మించి అప్పులు!

- బడ్జెట్ అంచనాలు, ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిని దాటిన తెలంగాణ అప్పులు
- చివరి త్రైమాసికంలో ఆర్బీఐ నుంచి 30,000 కోట్ల అప్పులకు ఇండెంట్
- ప్రతినెలా 10 వేల కోట్లు రుణ సమీకరణ
- ఆర్థిక నిపుణుల ఆందోళన

*హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ అపసవ్య దిశలో సాగుతున్నది. రేవంత్ సర్కారు చేస్తున్న అప్పులు, వస్తున్న ఆదాయానికి ఎక్కడా పొంతన కుదరడం లేదు. పరిమితికి మించి అప్పులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆదాయం సమకూర్చుకోవడంలో చేతులెత్తేస్తున్నది. ఎన్నడూ లేనివిధంగా ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి మించి, బడ్జెట్ అంచనాలను దాటి అందినకాడికి రుణ సమీకరణ చేస్తున్నది. పాలకుల అడ్డగోలు నిర్ణయాలు, ఏడాదికాలంలోనే రికార్డుస్థాయిలో పెరుగుతున్న అప్పులు, ఆర్థిక నిర్వహణ లోపాలపై ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ 31 వరకు ఒక్క ఆర్బీఐ నుంచే రూ.56,026 కోట్ల రుణాలు సేకరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్బీఐ నుంచి చివరి త్రైమాసికంలో రూ.30,000 కోట్లు తీసుకోవాలని ఇండెంట్ పెట్టింది. జనవరి నుంచి మార్చి వరకు ప్రతి మంగళవారం వేలంలో పాల్గొని నెలకు రూ.10,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రుణపర్వం రాష్ట్ర బడ్జెట్ అంచనాలను తారుమారు చేయడంతోపాటు ఉమ్మడి పాలకులు తెలంగాణపై మోపిన రుణభారాన్నీ మించిపోతున్నది. ఈ విధమైన మార్కెట్ రుణాలపై అధికంగా ఆధారపడటం*



*ప్రభుత్వం ముందుచూపులేమి, పాలన లోపాలను ఎత్తిచూపుతున్నది.*

**రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు ఇలా..**

*రేవంత్ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రుణ సమీకరణ వివరాలను వెల్లడించింది. అప్పు పద్దు కింద రూ.62 వేల కోట్లు చూపించింది. ఈ ఏడాది రూ.62,012 కోట్లు రుణ సమీకరణ చేయనున్నట్టు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1000 కోట్లు సమీకరించనున్నట్టు పేర్కొన్నారు. కానీ, డిసెంబర్ 31 నాటికే ఒక్క ఆర్బీఐ నుంచే రూ.56,026 కోట్లు సేకరించారు. వచ్చే మూడు నెలల్లో నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున మరో రూ.30 వేల కోట్ల రుణ సమీకరణకు ముందస్తు చర్యలు చేపట్టారు. తద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనాలకు అదనంగా రూ.8,897 కోట్లు అప్పు తెస్తున్నారు.*

**ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి ఇలా..**

*2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన రుణపరిమితి (ఎఫ్‌ఆర్‌బీఎం) రూ.49,255 కోట్లు మాత్రమే. కానీ, ఆర్బీఐ నుంచి మూడు త్రైమాసికాల్లో ఇప్పటికే తీసుకున్న రుణం రూ.40,909 కోట్లకు చేరింది. చివరి త్రైమాసికంలో ఆర్బీఐ నుంచి రూ.30 వేల కోట్ల రుణం పొందేందుకు బాండ్స్‌ను సిద్ధం చేసింది. అంటే ఈ ఆర్థిక సంవత్సరానికి ఎఫ్‌ఆర్‌బీఎం పరిధి కింద మొత్తం రుణం రూ.70,909 కోట్లకు చేరుతున్నది. అంటే అంచనాకు మించి అదనంగా రూ.21,654 కోట్లు రేవంత్‌రెడ్డి సర్కారు చేస్తున్నది.*

**ఎఫ్‌ఆర్‌బీఎం చట్ట పరిమితులు ఇలా..**

*ఆఎఫ్‌ఆర్‌బీఎం చట్టం ప్రకారం ఆయా రాష్ట్రాల జీఎస్డీపీలో 3.5 శాతం వరకు రుణం తీసుకోవడానికి అనుమతి ఉన్నది. 2024-25కు తెలంగాణ జీఎస్డీపీ సుమారు 16 లక్షల కోట్లుగా అంచనా వేశారు. దీని ప్రకారం రుణ పరిమితి రూ.57,112 కోట్లు. కానీ, కేంద్ర ప్రభుత్వం కొవిడ్-19 సమయంలో ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలు అనుసరించి ఈ పరిమితిని రూ.49,255 కోట్లకు తగ్గించింది.*

**అడ్డగోలు అప్పులపై విపక్షాల ఆగ్రహం**

*బడ్జెట్ అంచనాలను దాటి, ఎఫ్‌ఆర్‌బీఎం పరిధికి మించి రేవంత్ సర్కారు ప్రజలపై అప్పుల భారం మోపడంపై ప్రధాన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'బీఆర్‌ఎస్ పాలనలో ఆర్థిక క్రమశిక్షణ, అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోడెడ్లుగా సాగాయి. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలతో, ఆర్థిక అంశాలపై అవగాహన లేమితనంలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నది' అని బీఆర్‌ఎస్ నేత ఒకరు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అదనపు రుణాలకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందా? లేదా అనే విషయంపై రాష్ట్ర ఆర్థికశాఖ స్పష్టత ఇవ్వలేదు.*

**2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్‌ఆర్‌బీఎం కింద ఆర్బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం పొందిన రుణాలు**

| నెల | పొందిన రుణం | | |
|---|---|---|---|
| 2024 ఏప్రిల్ | 4000 కోట్లు | 2024 నవంబర్ | 1000 కోట్లు |
| 2024 మే | 4000 కోట్లు | 2024 డిసెంబర్ | 3,909 కోట్లు |
| 2024 జూన్ | 5000 కోట్లు | చివరి త్రైమాసికంలో పొందే రుణం | |
| 2024 జూలై | 8000 కోట్లు | 2025 జనవరి | 10,000 కోట్లు |
| 2024 ఆగస్టు | 6000 కోట్లు | 2025 ఫిబ్రవరి | 10,000 కోట్లు |
| 2024 సెప్టెంబర్ | 4,500 కోట్లు | 2025 మార్చి | 10,000 కోట్లు |
| 2024 అక్టోబర్ | 4,500 కోట్లు | మొత్తం రుణం | 70,909 కోట్లు |

భారత రిజర్వు బ్యాంకు రిపోర్టు ఆధారంగా..